www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 22 అక్టోబర్ 2023

ఆగని పోరు...

- ఓపిఎస్ సాధించేంత వరకు పోరాటం
- పోలీసులతో దీక్షలు భగ్నం చేయడం దారుణం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రభుత్వం ఎంత నిర్బధించినా అలుపెరగని పోరాటంతో ఓపిఎస్ సాధించుకోవాలని పట్టుదలతో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో 19, 20వ తేదీల్లో రెండు రోజుల పాటు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షలను పోలీసులు భగ్నం చేసినా తమ పోరాటాన్ని ముందుకు తీసుకుపోతామని యుటిఎఫ్ నేతలు ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. 11వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్ భరోసా కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధం అంటూ ఆమరణ దీక్షలకు పూనుకున్న యుటిఎఫ్ నేతల దీక్షలను ప్రభుత్వం పోలీసుల ద్వారా భగ్నం చేసింది. తమ ఆరోగ్యం బాగానే ఉందంటూ పోలీసులను యుటిఎఫ్ నేతలు ప్రతిఘటించారు. 2014 అక్టోబర్ 1వ తేదీకి ముందు నియామకం అయిన ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్‌ను అంధకారం చేసేలా ప్రభుత్వం కాంట్రూబ్యాటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను తీసుకొచ్చింది. నాటి నుండి నుండి సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ యుటిఎఫ్ సుదీర్ఘ పోరాటాన్ని సాగిస్తోంది. కొన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలను మభ్యపెట్టి ప్రభుత్వం గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ ఒప్పుకొనేలా చేసినా యుటిఎఫ్ సిపిఎస్, జీపిఎస్‌కు పెద్దగా తేడా లేదంటోంది. రానున్న ఎన్నికలో ఓపిఎస్‌కే ఓటు అనే నినాదంతో ముందుకు సాగాలని ఉద్యోగ, ఉపాధ్యాయులకు పిలుపునిస్తోంది.

సిపిఎస్- జిపిఎస్ పెద్ద తేడా లేదు...
- రఘుపతిరెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులను మభ్యపెట్టేలా సిపిఎస్ స్థానంలో జీపిఎస్‌ను తీసుకొచ్చింది. రెండింటిలో పెద్ద తేడా లేదు. 11వేల మంది మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్ అంధకారమవుతుంది. ఎట్టి పరిస్థితుల్లో జీపిఎస్‌ను ఒప్పుకొనే ప్రసక్తి లేదు. సిపిఎస్ సాధించేంత వరకు పోరాటాన్ని సాగిస్తాం.

అర్థరహిత వాదనలు
-జివి. రమణ, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఓపిఎస్‌ను అమలు చేస్తే ఆర్థిక సంక్షోభం వస్తుందంటున్న ప్రభుత్వ వాదన అర్థరహితం. కొన్ని రాష్ట్రాలు ఓపిఎస్‌ను అమలు చేస్తున్నాయి. ప్రజాసంక్షేమం ముఖ్యమంటున్న ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులను ప్రజల్లో భాగంగా చూడాలి. ఓపిఎస్‌ను అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాలకు భవిష్యత్ భరోసా కల్పించాలి. ఉద్యమబాటలో యుటిఎఫ్ ముందుంటుంది. న్యాయమైన హక్కులను పోరాడి సాధించుకుంటాం.

కార్పొరేట్‌లా... ప్రజల పక్షమా..
- సోమశేఖర్ నాయుడు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు

ఓపిఎస్ అమలు చేసి ప్రజల పక్షాన ఉంటారా.. జిపిఎస్ అమలు చేసి కార్పొరేట్ల పక్షాన ఉంటారా ప్రభుత్వాలే నిర్ణయించుకోవాలి. 3 సంవత్సరాల పూర్తయితేనే 50శాతం పెన్షన్ ఇచ్చే జిపిఎస్ కాంట్రిబ్యూషన్ కట్టించడం ఉద్యోగుల పాలిట మరణ శాసనమే 30 సంవత్సరాలు పనిచేసే ఉద్యోగ, ఉపాధ్యాయులకేమో వద్ధాప్యం పెన్షన్ కంటే తక్కువ పెన్షన్ రానుంది. ఇది చాలా దుర్మార్గం.

ఇచ్చి హామీ నిలబెట్టుకోవాలి
- సుధాకర్‌రెడ్డి, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు

జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా అధికారంలోకి వచ్చిన వారంలో సిపిఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలో వచ్చిన నాటి నుండీ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరుతున్నారు. సిపిఎస్‌ను రద్దు చేసేంతవరకు పోరాటాన్ని కొనసాగిస్తాం.

దీక్షలో యుటిఎఫ్ నేతలు (ఫైల్ ఫోటో)

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ ఎదుట ఎస్‌టియు దీక్షలు

దీర్ఘకాలిక ఆర్థిక బకాయిల విడుదల కోసం రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు ఎస్‌టియు నేతృత్వంలో ఉపాధ్యాయులు శనివారం కలెక్టరేట్ ఎదుట అక్రందన దీక్షలు చేపట్టారు. ఈకార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు పురుషోత్తం నాయుడు, మోహన్, మధన్ మోహన్ రెడ్డిలు మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దుచేసి ఓపిఎస్‌ను అమలు చేయడంతో పాటు ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు.

కలెక్టరేట్ ఎదుట దీక్షలు చేస్తున్న ఎస్టీయు నేతలు

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

పోలీస్ అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరులను స్మరించుకోవడం మన భాద్యత అని, వారు చేసిన త్యాగాలు, సేవలు మరువలేనివని చిత్తూరు జిల్లా ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఇ.భీమరావు, జిల్లా ఎస్పీ వై.రిశాంత్ రెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి చైతన్య కుమార్‌రెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శనివారం చిత్తూరు ఆర్మ్డ్ రిజర్వు పరేడ్ మైదానంలో అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించారు. చిత్తూరు జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ జడ్జి ఇ.భీమరావు, జిల్లా ఎస్పీ వై.రిశాంత్ రెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి చైతన్య కుమార్ రెడ్డి, ఐఎఫ్ఎస్.లు స్మృతి పరేడ్‌కు హాజరై, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. జిల్లా జడ్జి భీమరావు మాట్లాడుతూ... పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించుకుంటామని అన్నారు. ప్రజాశ్రేయస్సు, శాంతిభద్రతలే లక్ష్యంగా ముందుకు వెళుతున్నారన్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా పోలీసులు తమ ప్రాణాలనులోడ్డి విధులు నిర్వహిస్తున్నారని, పోలీసులకు ప్రజల సహకారం చాలా అవసరం అన్నారు. జిల్లాలోని పోలీసులు అండగా ఉంటూ అనేక రకాలుగా వారిని ఆదుకుంటామన్నారు. పోలీసులు పడుతున్న కష్టాన్ని శ్రమను గుర్తిస్తే వారికి అదే సంతోషం ఇస్తుందన్నారు. విద్యార్థులు, సమాజంలో ఉన్న ప్రజలు క్రమశిక్షణతో మెలిగేందుకు అవగాహన సదస్సులు కల్పించాలని జాయింట్ కలెక్టర్, జిల్లా ఎస్పీలను కోరుతున్నామన్నారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులను స్మరించుకోవడం మన బాధ్యతన్నారు. పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేమని అన్నారు. శాంతిభద్రతల కట్టడిలో పోలీస్‌వ్యవస్థ చాలా కీలకంగా పనిచేస్తున్న పోలీసులను సమాజం ఎప్పుడూ గుర్తుంచుకుంటుందని అన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దేశం కోసం ఎంతో మంది జవాన్లు తమ ప్రాణాలను అర్పించారన్నారు. ప్రజా రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగనిరతిని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21వ తేదీన పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా పాటిస్తున్నామన్నారు. సమాజం కోసం, భవిష్యత్తు తరాల కోసం, ప్రజారక్షణ కోసం పోలీసులు అహర్నిశలు తమప్రాణాలను లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నారు. ఆగష్టు నెలలో పుంగనూరులో అల్లరి మూకల దాడిలో చిత్తూరు పోలీసులు 50మంది వరకు గాయాలపాలైనారు. ఒక కానిస్టేబుల్ తన కంటిచూపును సైతం పోగొట్టుకున్నారు. అల్లరి ముష్కరులు ఇంతటి విధ్వంసం చేసిన పోలీసు వారు తమ మనోస్థైర్యాన్ని కోల్పోకుండా ప్రజల శాంతికి భంగం వాటిల్లకుండ లా అండ్ ఆర్డర్ ను కాపాడుటలో తమదైన నేర్పును ప్రదర్శించారు.

అమరులైన అందరి కోసం శ్రద్ధాంజలి ఘటిస్తూ, నివాళులర్పించి 2 నిమిషాల పాటు మౌనం పాటించారు. అమరులైన పోలీసు కుటుంబాల వారిని శాలువతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. జిల్లా అటవీశాఖ అధికారి మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న జరిగిన దురదష్ట సంఘటనను గుర్తు చేసుకుంటూ వారి త్యాగాలను సంస్మరణం చేసుకోవడం కోసం ప్రతిఏటా ఈ రోజున పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. కరోన లాంటి ప్రమాదకరమైన వైరస్ ప్రపంచం అంతటా వ్యాప్తి చెందినప్పుడు అందరు ఇళ్ళకు పరిమితమైన కూడా ఒక్క పోలీసు మాత్రమే వారి విధి నిర్వహించారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం అందరి బాధ్యత అన్నారు.

సత్తాచాటిన బాల మేధావులు

అంతర్జాతీయ సైన్సు ఎగ్జిబిషన్‌కు ఇద్దరు జిల్లా విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: 9వ జాతీయ స్థాయి అంతర్జాతీయ సైన్సు ఎగ్జిబిషన్‌లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. గుడిపాల మండలం జడ్పీహెచ్ఎస్ ఏఎల్ పురం 8వ తరగతి విద్యార్థి కె.ప్రణయ, పీలేరు మండలం జంగంపల్లి జడ్పీ హెచ్ఎస్‌లో 9వ తరగతి చదువుతున్న పడిగల చరణ్ తేజ్‌లు నవంబర్ 5 నుండీ 7వ తేదీ వరకు జపాన్ దేశంలో నిర్వహించే అంతర్జాతీయ సకురా ప్రాజెక్ట్ అండ్ ఎగ్జిబిషన్ కాంపిటీషన్‌కు ఎంపికైయ్యారు. చిత్తూరు జిల్లా నుండీ అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ప్రయణ, చరణ్ తేజ్‌లకు గైడ్‌గా శ్రీరంగ లక్ష్మి, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఆర్‌వి.రమణ జిల్లా కలెక్టర్ ప్రశంసలు అందుకున్నారు. జిల్లా కలెక్టర్ అంతర్జాతీయ స్థాయి సైన్సు ఇన్స్పైర్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైన విద్యార్థులు, వీరికి వెన్నుదన్నుగా నిలచిన గైడ్ ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందలు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించి చిత్తూరు జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని అభినందించారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ ఆర్‌వి.రమణ, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ తిరుపతి జిల్లా ప్రొఫెసర్ ఈశ్వర్ రామిరెడ్డి, ప్రొఫెసర్ శ్రీరామ్ సుందర్, పివికేఎన్ కాలేజ్ లెక్చరర్ భానుప్రకాష్, అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కుప్పం, హెడ్‌ఆఫ్‌ది డిపార్ట్మెంట్ కుమార్ వీరందరి ఆధ్వర్యంలో జపాన్‌కు వెళ్లే ప్రోటో టైప్ ప్రాజెక్ట్ కం ఎగ్జిబిట్స్ మార్పులతో భవిష్యత్తు పరిశోధనాత్మకంగా మార్పులు చేర్పులతో మూడుదశలలో అభివద్ధి పరిచి సత్ఫలితాలతో బాలశాస్త్రవేత్తలను నుంచి జపాన్ సకురాలో జిల్లాకు చెందిన బాల మేధావులు సత్తా చాటనున్నారు.

జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం

అర్హత సాధించిన అభ్యర్థులకు రూ. లక్ష నగదు ప్రోత్సాహకం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం కోసం దరఖాస్తుల ఆహ్వానం, 2023 ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు రూ.లక్ష నగదు ప్రోత్సాహకం ప్రభుత్వం అందించనున్నదని జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక, విద్యా, ఆర్ధికంగా బలహీనమైన వెనుకబడిన వర్గాల అభ్యర్థులకు ప్రభుత్వం 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం' అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టిందని, యుపిఎస్‌సి నిర్వహించే ప్రిలిమ్స్ అండ్ మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన వారి కోసం నగదు ప్రోత్సాహకంగా ఆర్థిక సహాయం అందించడం కోసం ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన వారికి రూ.1,00,000లు నగదు ప్రోత్సాహకం, మెయిన్స్ పరీక్షలో అర్హత సాధించిన వారికి రూ.50,000లు నగదు ప్రోత్సాహకం అందజేయబడునని తెలిపారు. ఇందులో భాగంగా మే, 2023లో నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలో సాధించిన అర్హులైన అభ్యర్థులకు లక్ష రూపాయల నగదు ప్రోత్సాహకం కోసం ఇప్పుడు దరఖాస్తులు ఆహ్వానించడమైనదని, కావున చిత్తూరు జిల్లాకు చెందిన అభ్యర్థులు మే 2023లో నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలో 'అర్హత పొందిన అభ్యర్థులు పోర్టల్లో అందించిన వెబ్ లింక్ ద్వారా ఆన్లైన్ నందు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి నవంబర్ 4 చివరి తేదీ లోపు పంపాలని కోరారు.

710 మంది రైతులకు రూ. 12.36 లక్షల ప్రోత్సహం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జగనన్న పాల వెల్లువలో భాగంగా పాడిరైతులకు విధేయత ప్రోత్సాహకం సుమారు 710 మంది రైతులకు ఒక లీటరుకు 0.50 పైసల చొప్పున మొత్తం రూ.12.36లక్షలు వారి అర్హత మేరకు బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో కొనసాగుతున్న జగనన్న పాల వెల్లువ పథకంలో వి.కోట, శాంతిపురం, రామకుప్పం మండలంలోని మహిళా డెయిరీ సహకార సంఘాల ద్వారా అమూల్ సంస్థ వారికి పాలు పోస్తున్నందున ఆంధ్రప్రదేశ్ డెయిరీ అభివద్ధి సహకార సమాఖ్య, గుంటూరు వారి సౌజన్యంతో అర్హత కలిగిన పాడి రైతులకు విధేయత ప్రోత్సాహకం వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా జమచేయడం జరిగినదని కలెక్టర్ తెలిపారు.

ఏకో టూరిజం హబ్‌గా కుప్పానిగుంట ఫారెస్టు

రూ.2 కోట్లతో అభివృద్ధి : డిఎఫ్ఓ

ప్రజాశక్తి - కార్వేటినగరం: ఏకో టూరిజం హబ్ కుప్పానిగుంట ఫారెస్టును అభివద్ధి చేస్తామని జిల్లా అటవీశాఖ అధికారి (ఐఎఫ్ఎస్ఓ) చైతన్యకుమార్రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రం సమీపంలోని కుప్పానిగుంటను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామితో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ పుత్తూరు–కార్వేటినగరానికి మార్గమధ్యంలో ఉన్న కుప్పానిగుంటను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి చొరవతో నగర వనయోజన పథకం ద్వారా అభివద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.రెండు కోట్లు మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే రూ. కోటి నిధులు మంజూరు అయ్యాయని డీఎఫ్ఓ పేర్కొన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రజలకు అనుకూలంగా, అడవుల్లోని ఆహల్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం కోసం వాకింగ్ ట్రాక్, చిన్నారుల ఆట స్థలం, జిమ్ము, విద్యార్థులకు విద్యపరంగా జ్ఞానాన్ని పెంచే విధం వివిధ రకాలైన అవగాహన కార్యక్రమాలతో పాటు అతిథిగహం నిర్మాణ చేపట్టి చూపరులను ఆకట్టుకునే విధంగా అభివద్ధి చేస్తామని తెలిపారు. అనంతరం మంత్రితో పాటు డీఎఫ్ఓ 7 కిలో మీటర్ల మేరా నడిచి సందర్శించారు. ఇందులో బాగంగా నక్షత్ర తాబేలు కుప్పానిగుంట ప్రాంతంలో ఆకస్మింగా కనిపించడంతో వాటిని డీఫ్వో నక్షత్ర తాబేలు విశిష్టతను వివరించారు. దీంతో మంత్రి వెంట ఉన్న వారు పవిత్రంగా భావించి తాబేలుకు మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఎకో టూరిజం ఏర్పాటుకు అనుమతించిన అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కతజ్ఞతలు తెలిపారు. వెంకట్రాద్రిపురం బటీ ప్రాంతంలో ఉన్న దారి సమస్యను పుత్తూరు ఎఫ్రోవ్‌తో పాటు కార్వేటినగరం ఎఫ్ఆర్ఓతో కలసి సందర్శించి పరిష్కరించారు. అనంతరం కార్వేటినగరం తలమానికంగా ఉన్న స్కంధపుష్కరిణీ, రాణిమహలు సందర్శించారు. కార్యక్రమంలో కార్వేటినగరం ఎస్ఆర్ఓ వెంకట సుబ్బయ్య, సెక్షన్ అటవీశాఖ అధికారి రవిరావు, స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, జిల్లా కార్యదర్శి గోపి, రైతు విభాగం కార్యదర్శి పద్మనాభశెట్టి, వెంకటేష్, వెంకటరత్నం, దాము, పలువురు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలు

పోటీలను ప్రారంభించనున్న మంత్రి రోజా

ప్రజాశక్తి- నగరి: క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం, క్రీడాశాఖ అందిస్తున్న సహకారంలో మన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జిస్తున్న విషయం విధితమే. క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించడంతో క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా ఎప్పుడూ ఒక అడుగు ముందే ఉంటారు. ఆమె అందిస్తున్న సహకారంతో నియోజకవర్గంలోని క్రీడా మైదానాల్లో ఎప్పుడూ ఎదో ఒక పోటీలు జరుగుతూనే ఉంటాయి. ప్రస్తుతం క్రీడా పోటీలు రాష్ట్రస్థాయికి చేరుకుంది. నగరి పట్టణంలో తొలిసారిగా నిర్వహిస్తున్న 8వ రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈపోటీలకు కేవీకే మైదానం సిద్ధమౌతోంది. ఇప్పటికే 13జిల్లాల నుంచి క్రీడాకారులు వారికి సంబంధిత కోచ్‌లు నగరి పట్టణానికి చేరుకున్నారు. మంత్రి సహాయ, సహకారాలతో పోటీల నిర్వహణకు సంబందిత ఏర్పాట్లను చిత్తూరు జిల్లా బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్నారు. రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలకు విచ్చేసిన బాల,బాలురకు, కోచ్‌లకు విడివిడిగా బసవసతి కల్పించారు. మైదానం వద్దే భోజన సౌకర్యం కల్పించారు. పోటీలకు సంబంధిత ఏర్పాట్లలో బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సభ్యులు, పీడీలు, పీఈటీలు నిమగ్నమయ్యారు. విచ్చేసిన క్రీడాకారులు తమ ప్రాక్టీస్‌ను మొదలు పెట్టారు. దీంతో కేవీకే మైదానం క్రీడాకారులతో కళకళలాడుతోంది. ఈ నెల 24 వరకు పోటీలు జరగనుంది. పోటీల్లో ప్రతిభ చూపిన వారి నుంచి జాతీయ స్థాయి జట్టును ఎంపిక చేయనున్నారు.

అంగన్వాడీలపై వేధింపులు మానుకోవాలి

ప్రజాదృష్టి

జిల్లాలో 12 అంగన్వాడీ ప్రాజెక్టులు ఉన్నప్పటికీ రోజురోజుకి అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు తీవ్రస్థాయికి చేరుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఎఫ్ఆర్ఎస్ యాప్ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు నిలుపుదలలో భాగంగా జిల్లాలో ఆందోళన బాటపట్టి నిలుపుదల చేశారు. జిల్లాలో బైరెడ్డిపల్లి, నగరి, పుంగనూరు, పలమనేరు, కుప్పం తదితర ప్రాజెక్టులలో అధికారులు ఇష్టారాజ్యంగా బెదిరింపులకు పాల్పడుతున్నారు. జిల్లాలో కుప్పం ప్రాజెక్టులో నిరంతరం అధికార పార్టీ నాయకుల అండదండలతో అధికారులతో కుమ్మక్కై బెదిరింపులకు పాల్పడుతూ 80 మందికి షోకాజ్ నోటీసులు ఇచ్చారంటే ఏ స్థాయిలో కక్ష్య సాధింపు చర్యలు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. అదేవిధంగా నగరి ప్రాజెక్టులో అధికారుల, ఎంఎస్‌కెలు వేధింపులు తీవ్రమైనవి. పుంగనూరు ప్రాజెక్టులో మినీ వర్కర్‌కి సోకాజ్ నోటీస్ ఇచ్చి వేధిస్తున్నారు. లబ్ధిదారులకు నష్టం చేకూర్చే నాణ్యతలేని ఆహారాన్ని సరఫరా చేయడాని అంగన్వాడీలు అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ఉన్నతాధికారులు కాంట్రాక్టర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కానీ చిన్నచిన్న కారణాలతో అంగన్వాడీలపై కక్ష కట్టి వేధింపులకు పాల్పడుతున్నారు. ఈమధ్య బంగారుపాలెం ప్రాజెక్టులో సరఫరా చేసిన జగనన్న పోషకాహారంలో పాము ఖలేబరం ఖర్జూరం ప్యాకెట్లలో ఉన్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోకుండా విచారణ పేరుతో ఉన్నతాధికారులు తప్పుడు సమాచారం ఇచ్చారు. అలాగే రాగి, పిండి జొన్న పిండి, చిక్కిల పురుగులు పడిన సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్ మాత్రం వెనకేసుకొస్తున్నారంటే అనుమానాలకు దారి తీస్తున్నది. కాంట్రాక్టర్‌ది కడప కాబట్టి ముఖ్యమంత్రి జిల్లా కనుక ఎలాంటి చర్యలు ఉండడం లేదు.

నిరంతరం అన్ని రకాల ప్రభుత్వ పనులు, అధికారులు చెబుతున్న పనులు చేస్తున్న అంగన్వాడీలపై వేధింపులు మాత్రం మానడం లేదు. లబ్ధిదారులకు నష్టం చేకూర్చే వాటిని రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో కూడా అంగన్వాడీలు పాటిస్తుంటే వారిపై రకరకాల పద్ధతుల్లో వాయిస్ మెసేజ్‌లు బెదిరింపులకు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అంగన్వాడీలు ప్రశ్నిస్తున్నారు. అంగన్వాడీలు సక్రమంగా పనిచేయకపోతే చర్యలు తీసుకోవాలే తప్ప పని చేస్తున్నప్పటికీ వేతనాలు కోత విధిస్తామని బెదిరిస్తున్న వారిపై జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలి.

కుప్పం ప్రాజెక్టు, ఇతర ప్రాజెక్టులలో ఉన్న సమస్యలపై అధికారుల సమన్వయ కమిటీ సమావేశం జరపాలని పదేపదే చెప్తున్నప్పటికీ ఐసిడిఎస్ అధికారులు స్పందించడం లేదు. ఎఫ్ఆర్ఎస్ యాప్ లబ్ధిదారులకు సక్రమంగా ఫోటోలు రాకపోతే అవి అప్లోడ్ కావు అప్పుడు వారికి వచ్చే పౌష్టికాహారం నిలిచిపోతుంది. మరి అలాంటి పరిస్థితిని అర్థం చేసుకొని అంగన్వాడీలు లబ్ధిదారులకు లాభం చేకూర్చే పద్ధతులను వివరిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అధికారులు బెదిరింపు పాల్పడడం బాధాకరం. పేద లబ్ధిదారులు పగటిపూట అత్యధికంగా కూలి పనులకు వెళ్తుంటారు. వారికి ఎఫ్ఆర్ఎస్ తీసుకోవాలంటే రాత్రులలో వెళ్లాలి. కుప్పంలో రాత్రులో వెళ్లి ఎఫ్ఆర్ఎస్ తీస్తున్న అంగన్వాడీ వర్కర్ పాముకాటుకు గురైంది. ఇలాంటివి జరిగితే అంగన్వాడీలను ఎవరు కాపాడతారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక చోట్ల నెట్వర్క్ ఉండడం లేదు. అలాంటి చోట్ల ఎఫ్ఆర్ఎస్ పనిచేయదు అలాంటప్పుడు నష్టపోతే లబ్ధిదారులు అంగన్వాడీలపై గొడవలకు వస్తారు. ప్రభుత్వం లబ్ధిదారులకు అంగన్వాడీల మధ్య చిచ్చుపెట్టే పనిచేస్తున్నది. ఇప్పటికే ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో మార్పులు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చి పది రోజులు అవుతున్నప్పటికీ ఎలాంటి చలనం లేదు. ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో మార్పులు చేసే వరకు అంగన్వాడీలు యాప్‌లో అప్లోడ్ చేయమని రాష్ట్ర వ్యాప్తంగా నిర్ణయానికి జిల్లాలో కూడా కట్టుబడి ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన హామీ అమలు అయ్యేంతవరకు జిల్లాలో ఐసిడిఎస్ అధికారులు అంగన్వాడీలపై వేధింపులకు మానుకోవాలని లేనిపక్షంలో అంగన్వాడీల పోరాటానికి సిద్ధమవుతున్నామని హెచ్చరిస్తున్నారు. **- విజిఆర్**

23న గ్రీవెన్స్ డే రద్దు: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 23న సోమవారం ప్రభుత్వ సెలవు దినం కావున గ్రీవెన్స్‌డేను రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని అర్జీదారులు గమనించి సమస్యల పరిష్కారం నిమిత్తం దూరప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వ్యయప్రయాసలకు ఓర్చి రావద్దని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి : కమిషనర్

పారిశుద్ధ్య కార్యక్రమాలు పరిశీలిస్తున్న నగర కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న ఆలయాల వద్ద పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేకదష్టి సారించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం కమిషనర్ నగరంలో సంతపేట, గిరింపేట, దుర్గానగర్ కాలనీ, కొంగారెడ్డిపల్లి ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. సంతపేట ప్రాంతంలోని పలు ప్రధాన ఆలయాల వద్ద పారిశుధ్య పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. ప్రధాన వీధులు, రోడ్లు శుభ్రంగా ఉంచాలని, ఎక్కడా వ్యర్థాలు లేకుండా క్రమం తప్పకుండా తొలగించాలన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయాల వద్ద పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. అధిక సంఖ్యలో భక్తులు సంచారం ఉంటుందని, పారిశుధ్యం మెరుగ్గా ఉంచాలన్నారు. ఆలయాల వద్ద చేపట్టాల్సిన పారిశుద్ధ్య పనులపై ఎంహెచ్వో, అధికారులకు మార్గనిర్దేశం చేశారు. గిరింపేట వద్ద పారిశుద్ధ్య నిర్వహణ తీరును, క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలను పరిశీలించారు. క్లాప్ వాహనం ద్వారా ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని అధికారులను ఆదేశించారు. క్లాప్ వాహనం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్లు చిన్నయ్య, లోకానాథం, పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాతా శిశు సంరక్షణ కార్డులో

అన్ని వివరాలు నమోదు చేయాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతి దేవి

సమావేశంలో మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్ఓ ప్రభావతి దేవి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఒ.ప్రభావతిదేవి ఆధ్వర్యంలో ఢిల్లీ నుంచి సెంట్రల్ పాపులేషన్ రీసెర్చ్ కమిటీ వారు డాక్టర్ శ్రీనివాసరాజు గతవారం రోజులుగా వివిధ జాతీయ కార్యక్రమాలపై జిల్లాలోని జిల్లా ఆస్పత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్‌వెల్నెస్ సెంటర్, అంగన్వాడీ సెంటర్ నందు పర్యవేక్షించి డేటా సమీకరించారు. ఈ డేటాను స్టేట్ ప్రోగ్రాం ఇంటిమెంటేషన్ ప్లానింగ్ (పిఐపి)లో క్రోడీకరించారు. తను మానిటర్ చేసిన విషయాలలో ముఖ్యంగా మాత శిశు సమీక్ష పై, గర్భిణీ స్త్రీలకు తప్పనిసరిగా అల్ట్రా స్కానింగ్, టిపా స్కానింగ్ ద్వారా బిడ్డ ఆరోగ్యాన్ని తెలుసుకోవచ్చని తద్వారా గర్భిణీ స్త్రీలకు తగిన సేవలు అందించి మాత శిశు మరణాలను తగ్గించవచ్చని తెలిపారు. మాతాశిశ సంరక్షణ కార్డు నందు అన్ని వివరాలు పూర్తి చేయాలన్నారు. జెఎస్‌వై పేమెంట్స్ 83శాతం మాత్రమే ఉందన్నారు, దీనిని 100శాతం తీసుకురావాలన్నారు. కాన్పులన్నీ ఎక్కువ ప్రైవేట్ హాస్పిటల్‌లో జరుగుతున్నది, అన్ని కాన్పులు ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగేలా అవగాహన కల్పించి, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఉచిత ట్రాన్స్పోర్ట్ వాడేలా చూడాలన్నారు. ఎన్నిడి, సిడి కార్యక్రమం, ప్రతి జాతీయ కార్యక్రమానికి టార్గెట్ పాపులేషన్ తప్పనిసరిగా ప్రతిఒక్కరు తెలుసుకోవాలని తద్వారా సేవలు అందించడానికి సులభమౌతుందని అన్నారు. ప్రతికార్యక్రమాన్ని యాప్‌లో క్వాలిటీ డేటాఅప్డేట్ చేయాలన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రానికి పిఆర్ఓ తప్పనిసరి ఉన్నట్లయితే పేషెంట్స్‌ను పెద్ద ఆస్పత్రికి రెఫర్ చేసేటప్పుడు తను అనుసంధానంగా వ్యవహరిస్తారన్నారు. అలాగే రోగుల ఫీడ్ బాక్ తీసుకొని ఉత్తమ సేవలు అందేటట్లు చూడాలన్నారు. డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, అడిషనల్ డిఎం హెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్, డిఐఓ రావిరాజు, డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ సందీప్, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ శిరీష, శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్పందన సమస్యలు సత్వరం పరిష్కరించాలి

ప్రజాశక్తి-సోమల: జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలని ఎంపిడివోయ వరప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కార్యాలయంలో సమీక్ష జరిపారు. శుక్రవారం సదుం మండలంలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 44అర్జీలు ప్రజలు అందజేసినట్లు గుర్తుచేశారు. స్పందన అర్జీలపై పురోగతి సాధించాలని, 15రోజులలో వాటికి పరిష్కారం చూపాలన్నారు. ఆ దిశగా అధికారులు పనిచేయాలని సూచించారు.

తహాశీల్దార్‌కి సన్మానం

ప్రజాశక్తి-ఎస్ఆర్‌పురం: మండల తహశీల్దార్ బాధ్యతలు స్వీకరించి బెన్నురాజును ఎంపిడివో కృష్ణయ్య, మాజీ వాటర్‌షెడ్ చైర్మన్ గుణశేఖర్‌నాయుడు శనివారం సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడివో కార్యాలయ సిబ్బంది బాలాజి, లత తదితరులు పాల్గొన్నారు.

మేటిమందలో పశు వైద్యశిబిరం

ప్రజాశక్తి-సోమల: మండలంలోని మేటిమందలో పశువైద్య అధికారులు శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్య సహాల సంచాలకులు శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 105 పశువులకు పిడుదల మందు పిచికారి చేయడం, 45 జూడలకు నట్టల నివారణ మందు త్రాపించడం, గర్భకోస, ఇతర వ్యాధులతో ఇబ్బంది పడుతున్న పశువులకు చికిత్స అందించడం జరిగిందని స్థానిక వైద్య అధికారిణి చందనప్రియ తెలిపారు. పాడి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అనూష, రవితేజ, సోము, కష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి పంచాయితీ కొటారిగడ్డకు చెందిన వైసిపి కార్యకర్త మల్లు సుబ్బారెడ్డి శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ సుబ్బారెడ్డి భౌతిక కాయానికి నివాళులు అర్పించి ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆయన వెంట ఎంపిపి సుబ్రమణ్యం, జడ్పీటిసి నితిన్, సర్పంచ్ రాజగోపాల్ , కేశవరెడ్డి, అశోక్ రెడ్డి, మంజునాథ్ తదితులున్నారు.

అమరవీరులారా మీకు వందనం..

ప్రజాశక్తి-సోమల: పోలీసు అమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా సోమల బస్టాండ్ కూడలిలోని గాంధీ విగ్రహం వద్ద ఎస్సై వెంకటనరసింహులు, సిబ్బంది గ్రామస్తులు పోలీసు అమరవీరులకు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పలువురు పోలీసులను స్మరించుకుంటూ సంస్కరణ దినోత్సవాన్ని నిర్వహించారు. అదేవిధంగా సదుం బస్టాండ్ కూడలిలో పోలీసు అమరవీరుల సంస్కరణ దినోత్సవాన్ని పోలీసు సిబ్బంది ప్రజలు నిర్వహించారు.

మాజీ ఎంపీకి ఘన నివాళులు

రాజగోపాల్ నాయుడు విగ్రహానికి నివాళులర్పిస్తున్న గల్లా అరుణకుమారి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మాజీ ఎంపీ పాటూరు రాజగోపాల్ నాయుడు 26వ వర్ధంతి సందర్భంగా అమరరాజా వ్యవస్థాపక చైర్మన్ గల్లా రామ చంద్ర నాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి ఘనంగి నివాళి అర్పించారు. శనివారం తవనంపల్లి మండలం దిగువమాఘం గ్రామం నందు గల రాజన్న మెమోరియల్ పార్క్‌లో రాజగోపాల్ నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేణుగోపాల్ నాయుడు, మాజీ జెడ్‌పిటిసి వెంకటేష్ చౌదరి, దిగువమాఘం సర్పంచ్ గోపి, మాజీ సర్పంచ్ కుమార్ నాయుడు, రాజన్న ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్, యల్లంపల్లి సురేష్ పాల్గొన్నారు.

చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు చిత్తూరు రెవెన్యూ డివిజన్ అధికారిగా జి.చిన్నయ్య శని వారం ఉదయం బాధ్య తలు స్వీకరించిన అనంతరం జేసి బంగ్లాలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీని వాసులును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

జెసి కతజ్ఞతలు తెలియజేస్తున్న చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య

27న శ్రీకాళహస్తికి నారా భువనేశ్వరి రాక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఈనెల 27వ తేదీ శుక్రవారం శ్రీకాళహస్తికి రానున్నట్లు ఇక్కడి టీడీపీ శ్రేణులకు సమాచారం అందింది. ఇందులో భాగంగా నారా భువనేశ్వరి శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకోనున్నారు. నారా భువనేశ్వరి శ్రీకాళహస్తి పర్యటన సమాచారం అందినా, ఇంకా అధికారికంగా ఖరారు కావాల్సి ఉందని టీడీపీ శ్రేణులు తెలిపాయి.

30 నుండి గ్రామీణ ఉత్పత్తుల ఎగ్జిబిషన్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రాష్ట్ర స్థాయి ఖాదీ, గ్రామీణ ఉత్పత్తుల ప్రోత్సాహంలో భాగంగా తిరుపతి అంకాలమ్మ గుడి దగ్గర గల ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఈనెల 30 నుండి నవంబర్ 8వ తేదీ వరకు రాష్ట్రస్థాయి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నట్లు ఏపీ ఖాదీ, గ్రామీణ ఉత్పత్తుల బోర్డ్ సిఇఓ విజయరాఘవ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఖాదీ, గ్రామీణ ఉత్పత్తులకు చేయూతనిచ్చే ప్రోత్సాహంలో భాగంగా తిరుపతిలో రాష్ట్ర చేనేత, జౌళి, పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్నాద్ ఈనెల తేది 30న ప్రారంభించనున్నారని, నగర ప్రజలు పాల్గొని మన సంస్కృతి, సంప్రదాయాల వస్తువు లకు సహకారం అందించాలని కోరారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- రేణిగుంట : అమరరాజ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో నిరుద్యోగ యువతకి ఉచిత శిక్షణ ఉపకార వేతనం (స్టైపెండ్)తో పాటు ఉద్యోగ అవకాశాలు కలవని అమరరాజ యాజమాన్యం తెలిపారు. అమరరాజా సంస్థ మద్దతుతో రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2014లో అమర రాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ని చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలో స్థాపించారు. ఇప్పటి వరకు ఈ సంస్థ ద్వారా (14 బ్యాచ్ లు) 1314 మంది నిరుద్యోగ యువత తమ ట్రైనింగ్ పూర్తి చేసుకున్నారు. ఇలా ట్రైనింగ్ పూర్తి చేసుకొన్న 1314 మందికి అమరరాజ సంస్థలో పర్మినెంట్ ఉద్యోగ అవకాశం కల్పించారు. ఇప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ లో 18 బ్యాచ్ ల్లో 1370 మంది నిరుద్యోగ యువత శిక్షణ పొందుతున్నారు. అమర రాజా స్కిల్ డెవలప్‌మెంటు సెంటర్ లో 10వ తరగతి పాస్ ఫెయిల్ లేదా ఇంటర్ పాస్ ఫెయిల్ అయిన నిరుద్యోగ యువతి యువకులు కి (33వ బ్యాచ్) అడ్మిషన్స్ జరుగు తున్నాయి. ఎంపికైన విద్యార్థులకు శిక్షణా కాలంలో మొదటి 03 నెలలు నెలకు రూ 7500 లు, తదుపరి 21 నెలలు రూ. 11453 నుండి రూ 11853 వరకు ఉపకార వేతనం (స్టైపెండ్) ఇవ్వనున్నారు. 33వ బ్యాచ్ అడ్మిషన్లు 26 అక్టోబర్ 2023 నుండి ప్రారంభం అవుతాయన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని కోరుతూ ఇతర వివరాలకు 9000024919, 9100477371 సంప్రదిం చాలని కోరారు.

టీటీడీలో ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేయాలి

ప్రజాశక్తి -రేణిగుంట : తిరుపతి తిరుమల దేవస్థానంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని శనివారం బిసి విద్యార్థి సంఘర్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పూల వెంకటాద్రి యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీటీడీలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి దాదాపు 15 సంవత్సరాలు అయిందని ఇటీవల కాలంలో యువత ఎంతగానో ఎదురుచూస్తున్నప్పటికీ నోటిఫికేషన్ ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. టిటిడి అధికారులు, ముఖ్యమంత్రి చొరవ తీసుకొని వెంటనే టిటిడిలో ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేయాలని ఈ సందర్భంగా డిమాండు చేశారు.

ప్రజా సమస్యలను అలసత్వం చేయకండి: జెసి

జగనన్నకు చెబుదాం అర్జీలపై సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజలకు సేవచేయమని ప్రభుత్వం మనకు ఉద్యోగాలు ఇచ్చిందని, ప్రజా సమస్యల అలసత్వం చేయకుండా పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం ఉదయం ఐరాల మండలం ఎంపిడిఓ కార్యాలయం సమావేశం హాల్‌లో తహశీల్దార్ సుశీల, ఎంపిడిఓ నాగరాజలతో కలసి గత సెప్టెంబర్ 8న నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు తీసుకున్న చర్యలకు సంబంధించి పరిశీలించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాడానికి మనకు ప్రభుత్వం ఉద్యోగ అవకాశం కల్పించందని, ప్రజలసేవకు ఉపయోగించలేతప్ప వేరే వారికి ఉపయోగించడం మంచిపద్ధతి కాదన్నారు. జగనన్నకు చెబుదాం స్పందనలో ప్రజాసమస్యలపై ప్రజలు అందజేసిన అర్జీల పరిష్కారానికి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. చట్టపరంగా పరిష్కరించేటుగా ఉంటే వెంటనే పరిష్కరించాలని పరిష్కారం కాలేనిది అయ్యితే ఎందువల్ల పరిష్కారం కాలేదోన్న సమాచారాన్ని అర్జీదారునికి లేఖ ద్వారా తెలియజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు వారంలో రెండు రోజులు బుధ, శుక్రవారాలలో మండలస్థాయిలో జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గత సెప్టెంబర్ 8న పూతలపట్టు నియోజకవర్గం, ఐరాల మండల కేంద్రంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమంలో మండలంలోని ప్రజలు వివిధ రకాల సమస్యల పరిష్కారం కోసం 124మంది అర్జీదారుల అందజేసిన విషయం తెలిసిందేనని, అర్జీదారుల సమస్యలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతతో నిర్ణీత గడువులోపల పరిష్కరించాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందని అందులో భాగంగానే శనివారం అధికారులు సమస్యల అర్జీలపై తీసుకున్న చర్యలను పరిశీలించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సుధాకర్, వివిధ శాఖల మండలస్థాయి అధికారులు, విఆర్‌ఓలు, పంచాయతీ సెక్రెటరీలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోనే కార్పొరేట్ వైద్యం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంపిపి

ప్రజాశక్తి బంగారుపాళ్యం: గ్రామాల్లోనే కార్పొరేట్ వైద్యము అందిస్తున్నట్లు ఎంపీపీ అమరావతి అన్నారు. శనివారం మండలంలోని ఈచినేరిపల్లి సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సర్పంచ్ అనురాధ ఆధ్వర్యంలో జరిగినది. కార్యక్రమంలో సర్పంచ్ ఉషశ్రీ, ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి వైద్యులు యుగంధర్, రమేష్, లోకేష్, సంధ్యారాణి, ప్రశాంతి పలువురు వైద్య సచివాలయ సిబ్బంది ఆశా వర్కర్లు గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని బేలుపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎంపీపీ రెడ్డప్ప హాజరైయ్యారు. సర్పంచ్ విసి వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 276 మంది ప్రజలు వైద్య సేవలందుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, ఎంపీటీసీ భాస్కర్, అధికారులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: మండలంలోని వరతూరు పంచాయతీ పరిధిలోని కాలేపల్లి గ్రామంలో ఎంపీడీవో శ్రీదేవి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. శనివారం కార్యక్రమంలో మాజి ఎంపిటిసి మమత, అయ్యప్పరెడ్డి, గోపాల్:రెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మండలంలోని నిడిగుంట పంచాయితీలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఎంపిపి రెడ్డెప్ప, జెడ్పిటిసి సుష్మాకీర్తి పాల్గొన్నారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో నాయకులు జీ.డి.బాబు, తమ్మిరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, రాజారెడ్డి, దేవసేనమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ నిరసనలు, పూజలు

కోలనాంపల్లిగుడి వద్ద పూజలు చేస్తున్న టిడిపి మహిళలు

ప్రజాశక్తి-యదమరి: అవినీతికి కేరాఫ్ జగన్ మోహన్ రెడ్డి అని మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు చిత్ర మండిపడ్డారు. ఈ మేరకు శనివారం మండలంలోని కొలనాంపల్లి గ్రామంలో వెలసిన సీతా రామాలయంలో చంద్రబాబు నాయుడు ఆరోగ్యం బాగుండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని లక్షల కోట్ల రూపాయలు అక్రమ సంపాదనకు తెరలేపి ఈడీ, సీబీఐ కేసుల్లో 16 నెలలు జైలు జీవితం గడిపిన జగన్ మోహన్ రెడ్డి టిడిపి అధినేత చంద్రబాబును కక్షపూరితంగా అక్రమ కేసులు బనాయించి, వ్యవస్థలను మ్యానేజ్ చేసుకుని 43 రోజులుగా మానసిక శోభకు గురి చేయడం తగదని నిప్పులు చెరిగారు. రానున్న ఎన్నికల్లో మహిళలే తగిన గుణపాఠం చెప్పి జగన్మోహన్ రెడ్డిని గద్దె దింపుతారని చెప్పారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్యామల, మహిళా నేతలు ఉష, జ్యోతి, చంద్రకళ, మంజుల, వసంత, భువనేశ్వరి, లావణ్య, నందిని, పద్మ, వైజయంతి, సావిత్రి, వనజ, కుమారి, రమాదేవి, సుగుణ, రమణ, రోజా, కేసాని సుజాత, మల్లీశ్వరి, జయమ్మ, కె సుజాత, పూజ, శిల్ప, వనజ, భారతి, విజయ, మునెమ్మ, సీబీఎన్ ఆర్మీ సభ్యుడు పురుషోత్తం నాయుడు, టిడిపి నేత కోదండ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి జైలు పాలు చేశారని టిడిపి నేతు నిరసన తెలిజేశారు. బంగారుపాళ్యం టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ మండల ఉపాధ్యాక్షులు లోకనాథం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జనార్ధన్ గౌడ్ మాట్లాడుతూ చంద్రబాబుపై అక్రమ కేసులు నమోదు చేసి రాజమండ్రి సెంట్రల్ జైల్లో నిర్భంధించడం మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు సూరి మంజు రమేష్ చిన్నయ్య పలువురు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పుంగనూరులో ప్రజాస్వామ్యాన్ని కాపాడలేరా'

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి-పుంగనూరు: చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో ప్రతిపక్ష నాయకులు తిరగకూడదు అనే పద్ధతుల్లో నిరంతరం దాడులు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ప్రజాస్వామ్యాన్ని కాపాడలేరా అని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం నుంచి సైకిల్ యాత్ర చేస్తున్న టిడిపి కార్యకర్తలను పుంగనూరు వైకాపా నాయకులు కొందరు అడ్డుకొని, వారి చేతిలోని టిడిపి జండాలు, వారు ధరించిన పసుపు చొక్కాలను విప్పించి పంపించారన్నారు. శుక్రవారం నాలుగు గంటలకు పుంగనూరు మండలం సుగాలిమిట్ట వద్ద టీ తాగడానికి ఆగారు. ఈ విషయం తెలుసుకున్న వైసిపి కార్యకర్త సూరి మరి కొందరితో కలిసి వచ్చి సైకిల్ యాత్ర వచ్చిన వారిని దబాయించారన్నారు. అసభ్యకరంగా దూషించడం దారుణమన్నారు. పుంగనూరు పెద్దిరెడ్డి అడ్డా, ఇక్కడకి చంద్రబాబునే రానివ్వలేదు, మీరెలా వస్తారు? అంటూ గట్టిగా మందలించడం దౌర్భాగ్యమన్నారు. సైకిళ్లకు కట్టిన జండాలు పీకించి, వేసుకున్న చొక్కాలు విప్పించి వెనక్కు పంపారంటే ఏ స్థాయిలో అక్కడ దౌర్జన్యం ఉందో అర్థం చేసుకోవచ్చు అన్నారు. నిరంతరం పుంగనూరులో పౌరుల హక్కులకు భంగం కలుగుతున్నా ప్రభుత్వం కానీ మంత్రులు గాని పట్టించుకోకపోవడం అనుమానాలకు దారితీస్తుందన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎవరైనా నిరసన కార్యక్రమాలు చేయవచ్చు అన్నారు. మరి పుంగనూరులో అలా కాకుండా అధికార పార్టీ మాత్రమే ఏదైనా చేయాలి ఇతరులు ఎవరూ చేయకూడదు అనే పద్ధతుల్లో వ్యవహరించడం చాలా బాధాకరమన్నారు. ప్రతిపక్షాలపై దౌర్జన్యాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు మేలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో 10వ వార్డు సచివాలయంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే, మేయర్ ఎస్.అముద పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలతో ఎంతో మంది పేదలకు కార్పొరేట్ తరహా వైద్యసేవలు అందుతోందన్నారు. పేదలకు మెరుగైన విద్య, వైద్యసేవల అందించడం కోసం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. సందర్భంగా వైద్యశిబిరంలో ఏర్పాటు చేసిన వైద్యవిభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఐసిడిఎస్, డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌లను సందర్శించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, సీఎంఎం గోపి, వైద్యాధికారులు, నగరపాలక అధికారులు, వార్డు కార్యదర్శులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ కార్డు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

గవర్నర్‌కు ఘనస్వాగతం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం రాత్రి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కి ఘనస్వాగతం లభించింది. జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణా రెడ్డి, ఎస్పి పరమేశ్వర రెడ్డి, అడిషనల్ ఎస్పి కులశేఖర్, ఆర్‌డిఓ కనకనరసా రెడ్డి, డిప్యూటి కలెక్టర్‌లు భాస్కర్ నాయుడు, శ్రీనివాసులు, రేణిగుంట తహశీల్దార్ ఉదయ సంతోష్, డిఎస్‌పి భవ్య, స్వాగతం పలుకగా విమానాశ్రయంలో ఏర్పాట్లను రెవెన్యూ, పోలీస్ అధికారులు పర్యవేక్షించారు. అనంతరం గవర్నర్ రోడ్డు మార్గాన తిరుమల బయలుదేరి వెళ్ళారు. నేటి రాత్రి తిరుమలలో బసచేసి ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని మధ్యాహ్నం 12 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకొని బెంగళూరు వెళ్లనున్నారు.



తిరుమలకు చేరుకున్న గవర్నర్

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నసీర్ శనివారం సాయంత్రం తిరుమల చేరుకున్నారు. రచన విశ్రాంతి గహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, ఇతర అధికారులు స్వాగతం పలికారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

- కలిగిరి కొండ వద్ద ట్రాక్టర్ బోల్తా - 13మందికి గాయాలు
- చౌడేపల్లిలో మూడు ప్రమాదాలు, ఒకరి మృతి, ఆరుగురికి గాయాలు

చిత్తూరు ఆసుపత్రిలో గాయాలతో చికిత్సపొందుతున్న క్షతగాత్రులు

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: కలిగిరి కొండకు వెళ్లి తిరిగి వస్తున్న ట్రాక్టర్ బోల్తా పడి 13మంది గాయాలపాలైన సంఘటన శనివారం పెనుమూరులో చోటుచేసుకొంది. వివరాలు ఇలా ఉన్నాయి.. శనివారం కావడంతో గంగాధరనెల్లూరు మండలం బట్టుకండ్రిగకు చెందిన గ్రామస్తులు ట్రాక్టర్‌లో పెనుమూరు మండలంలోని కలిగిరికొండ వేంకటేశ్వరస్వామి దర్శనానికి బయలుదేరారు. దర్శన అనంతరం మద్యాహ్నం తిరుగు ప్రయాణంలో కొండ సమీపంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించ బోయిన ట్రాక్టర్ అదుపుతప్పింది. రోడ్డు ఏటవాలుగా ఉండడంతో ట్రాక్టర్ బోల్తాపడింది. ట్రాక్టర్‌లో 30మంది ప్రయాణిస్తుండగా 13 మంది గాయాలపాలైయ్యారు. సంఘటనా స్థలం నుంచి స్థానికులు 108సాయంతో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎలాంటి ప్రాణాపాయం లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. వారికి మెరుగైన చికిత్స కోసం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. బాధితులను గంగాధరనెల్లూరు తహశీల్దార్ ఇన్బనాథన్, సర్పంచ్ ఏకాంబరం, వీఆర్‌వో ప్రభావతి గాయపడిన వారికి చికిత్స ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

క్షత్రగాత్రులకు మెరుగైన వైద్యం అందించండి-డిప్యూటి సిఎం

కార్వేటినగరం: కలిగిరి కొండపై చోటు చేసుకున్న విషాదంపై డిప్యూటీ సీఎం నారాయణస్వామి దిగ్భ్రాంతికి గురైయ్యారు. కార్వేటినగరం పర్యటనలో ఉన్న ఆయన ప్రమాద సంఘటన సమాచారం అందుకున్న మంత్రి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్కు ఫోన్ చేసి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఎలాంటి విషాదం చోటు చేసుకోకుండా చూడాలని సూచించారు.

వేర్వేరు ప్రమాదాల్లో..

ఒకరి మృతి, ఆరుగురికి గాయాలు

చౌడేపల్లి: మండలంలో జరిగిన మూడు వేర్వేరు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందారు, పలువురికి గాయాలపాలైయ్యారు. చౌడేపల్లి-పరికిదొన మార్గంలో బైక్‌పై వెలుతున్న నలుగురు యువకులను ట్రాక్టర్ ఢీకొనింది. దీంతో బైక్‌పై వెలుతున్న యువకుడు శ్రీనివాస్(15) తీవ్రంగా గాయపడ్డాడు. మరో ముగ్గురు రెడెప్ప(14), యూనస్(15), సంతోష్(14)లకు గాయాలైయ్యాయి. స్థానిక ఆరోగ్య కేంద్రానికి వీరిని తరలించగా చికిత్స పొందుతూ శ్రీనివాస్ మృతి చెందాడు. కాగా మిగిలిన ముగ్గురు యువకులు చికిత్స పొందుతున్నారు. తిరుపతి-చౌడేపల్లి ప్రధాన రహదారిలో సింగిరిగుంట వద్ద జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో బైక్‌ను కారు ఢీకొన్నది. ప్రమాదంలో యువకుడు రవి(25)కి తలకు, కాలుకి బలమైన గాయాలతో పుంగనూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. చౌడేపల్లి-పుంగనూరు ప్రధాన రహదారిలో బిల్లేరు గౌడింఢ్ల వద్ద జరిగిన ప్రమాదంలో ఆటోను వెనుక నుంచి ఆర్టిసి ఢీకొన్నది. ఈ ప్రమాదంలో యువకులు సిద్ధిక్(25), సాదిక్(22)లకు గాయాలయ్యాయి. వారిని పుంగనూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి బంగారుపాలెం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ముత్యాలమ్మ ఆలయంలో విశేషపూజలు జరిగాయి. దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దేదీప్యమానంగా దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

కార్వేటినగరం: దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక బంగామ్మ ఆలయంలో శనివారం విశేష పూజలు జరిగాయి. అర్చకులు అమ్మవారికి అభికాలు, అలంకరణ చేసి భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. సరస్వతిదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యాక్షుడు రంగనాధమొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్పిళ్లై పలువురు భక్తులు పాల్గొన్నారు. మండల పరిధిలోని ఆకత్తూరు ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

గంగాధరనెల్లూరు: మండలంలోని ముసలయ్యగారిపల్లెలో గంగమ్మ దేవస్థానంలో మండలాభిషేక పూజలు వేదపండితుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇటీవల ఆలయ జీర్ణోద్ధరణ చేసి ఆలయాన్ని తెరిపించారు. ఈ నేపథ్యంలో 48 రోజులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శనివారం మహా యజ్ఞం ఏర్పాటు చేసి అమ్మవారికి జలాభిషేకం చేసి మండలాభిషేక పూజలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయధర్మకర్త మునిరాజారెడ్డి, డీకే కుమార్, వెంకటేష్ రెడ్డి, రవి, శంకర్‌రెడ్డి, ధనంజయరెడ్డి, మునుస్వామిరెడ్డి, కృష్ణారెడ్డి, స్థానిక ఎంపీటీసీ రామచంద్ర రెడ్డిలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



గంగాధరనెల్లూరు: ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. చైర్మన్ నాగరాజురెడ్డి, ఈవో చంద్రమౌళి, ధర్మకర్తల మండలి సభ్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సోమల: మండలంలోని కందూరులో వెలసిన వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి విశేషంగా పూజలు జరిగాయి. అర్చకులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆటో డ్రైవర్లకు పూర్తి సహకారం

మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రహదారీ భద్రత నియామాలను ఆటోడ్రైవర్లు విధిగా పాటించాలని రవాణా శాఖ అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ భవన్‌లో భద్రతా నియమాలపై జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిధిగా విచ్చేసి ప్రసంగించారు. ఆటోడ్రైవర్లు పొట్టకూటి కోసం పడుతున్న శ్రమను అనిర్వచనీయమన్నారు. అలాగే నగరంలో ఆటో డ్రైవర్లు పలురకాల సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటిని దశలవారీగా పరిష్కరించడానికి కషి చేస్తామన్నారు. అలాగే ఆటో డ్రైవర్లందరికీ లైసెన్స్ వచ్చేలా రవాణాశాఖ ఉన్నతాధికారులతో సంప్రదించి న్యాయం చేస్తామని వెల్లడించారు. అనంతరం ఆటోడ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు మాలిక్ పలు సమస్యలను రవాణా శాఖాధికారులకు వివరించారు. ఆటోడ్రైవర్లు.. మినిమమ్ ఛార్జీ పెంచుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే థర్డ్ పార్టీ బీమా చేసుకోవడానికి సౌకర్యం కల్పించాలని కోరారు. అదేవిధంగా ఆటోలో అత్యవసర సమయంలో రోగులను సీఎంసీ తీసుకెళ్లడానికి అనుమతి ఇవ్వాలని కోరారు.

ఆటో డ్రైవర్ల సమావేశంలో మాట్లాడుతున్న మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్.

తిరుపతి అభివృద్ధికి అడ్డంగా మారిన

బిజెపి తీరును వ్యతిరేకించండి..

వామపక్ష నేతల పిలుపు

తిరుపతి అభివృద్ధి నిధులపై మాట్లాడుతున్న నేతలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి అభివృద్ధి కోసం సంవత్సరానికి ఒక శాతం నిధుల కేటాయించాలని టీటీడీ పాలకమండలి చేసిన నిర్ణయం మనకందరికీ విధితమే. ఈనిధులు కేటాయింపుపై బిజెపి అడుగడుగునా అడ్డుకుంటుందని, బిజెపి తీరును తిరుపతి ప్రజలు వ్యతిరేకించాలని శనివారం యశోదనగర్‌లోని సిపిఎం కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ తిరుపతి అభివద్ధికి టీటీడీ నిధులు కేటాయించడం సరైందికాదని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం అన్యాయమన్నారు. బిజెపి ఒత్తిడికి రాష్ట్ర ప్రభుత్వంలోనై ఈ నిర్ణయం చేసిందని విమర్శించారు. విభజన హామీలను అమలు చేయకుండా, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, వెనుకబడిన ప్రాంతాలకి ప్యాకేజీలు ప్రకటించకుండా రాష్ట్రానికి బిజెపి ద్రోహం చేసిందని విమర్శించారు. అభివృద్ధి నిరోధకులుగా బిజెపి వైఖరి స్పష్టంగా కనపడుతుందన్నారు. తిరుపతి అభివృద్ధిని అడ్డుకోవాలని పదేపదే బిజెపి కుట్రలకు పాల్పడుతుందని, ఈ కుట్రలను తిరుపతి ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బిజెపి వైఖరిని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు వ్యతిరేకించాలన్నారు. తిరుపతి అభివృద్ధి కోసం టీటీడీ నిధులు కేటాయించే వరకు వివిధ ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కందారపు మురళి, నగర కార్యదర్శి టీ.సుబ్రహ్మణ్యం, నాయకులు వేణు, మునిరాజా, రాధాకృష్ణ, తంజావూరు మురళి, అక్బర్, రవి, సిపిఐ నాయకులు రాధాకృష్ణ, రవి, శ్రీరాములు, రాజా పాల్గొన్నారు.